క్లుప్తంగా


సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శం



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని సీపీఎం రాష్ట్ర నాయకుడు మిరియం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం ఆయన వర్ధంతిని సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. కార్మికులను సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు, బాలం శ్రీనివాస్, చల్లా విశ్వనాథం, సిరిపురపు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ కునిరెడ్డి అరుణ, నెక్కల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి పర్వదినం కావడంతో తెల్లవారు జామున ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

అధ్వానంగా పారిశుధ్యం



కొత్తపల్లిలో పూడుకుపోయిన డ్రైన్

కొత్తపల్లి: గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. డ్రైన్లు పూడుకుపోవడంతో మురికినీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ముఖ్యంగా పాఠశాలలు, ప్రధాన రహదారులు, ఆలయాల వద్ద చెత్త పేరుకుపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు చెత్త వేసేందుకు నిర్దిష్టమైన ఏర్పాట్లు లేకపోవడంతో ప్రజలు వీధుల్లోనే వ్యర్థాలు వేస్తున్నారు. వాటిలో వర్షపు నీరు చేరడంతో వీధులు మురికికూపాలుగా మారాయి. దీంతో దోమలు పెరిగిపోయి వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

గొల్లప్రోలు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హనుమంతరావు హెచ్చరించారు. మండలంలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లోని ప్రజలతో ఆదివారం ఆయన సమావేశాలు నిర్వహించారు. కౌంటింగ్ రోజున ఎటువంటి గొడవలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలు అని, ఆ తర్వాత అందరూ అన్నదమ్ముల్లా మెలగాలన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత ఎవరైనా గ్రామాల్లో తగాదాలు సృష్టిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసు, ఎస్ఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

ప్రత్తిపాడు రూరల్: విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ వి.సన్యాసి సూచించారు. మండలంలోని ధర్మవరం గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి జూన్ 7 వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణతో పాటు స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాయింగ్ పోటీలు వంటి నిర్వహించనున్నట్లు తెలిపారు.

నెరవేరని లక్ష్యం - లక్షలు వృథా

- నిరుపయోగంగా సేంద్రియ ఎరువుల తయారీ యూనిట్లు
- అధికారుల పర్యవేక్షణ లేక పిచ్చిమొక్కలతో నిండిన కుండీలు
- మోడల్ కేంద్రాల్లో తప్ప పలుచోట్ల శిథిలావస్థకు చేరిన వైనం

పెద్దాపురం: సేంద్రియ సాగు విధానాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు ఎరువుల తొట్ల (నాడెప్ తొట్ల) నిర్మాణాలు నిరుపయోగంగా ఉన్నాయి. సాగుకు సాయం అందించాలని వర్మీ, సేంద్రియ ఎరువుల తయారీ యూనిట్లను మంజూరు చేశారు. వీటి నిర్మాణానికి లక్షలాది రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేశారు. తీరా చూస్తే ఎరువుల తయారీ కుండీలు ఖాళీగా, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. వీటిపై రైతులకు అవగాహన కల్పించేవారే కరువయ్యారు. పర్యవేక్షణ లోపం వల్ల నాడెప్ యూనిట్ల నిర్వహణ అధ్వానంగా తయారైంది.

నాడెప్ కంపోస్ట్ పిట్ అంటే ఎన్‌డీ పండరిపాండే కనిపెట్టిన విధానంలో కంపోస్ట్ ఎరువును తయారు చేయడానికి ఉద్దేశించిన కట్టడం. ప్రజల జీవన శైలి నెమ్మదిగా సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల వైపు సాగుతున్న తరుణంలో సేంద్రియ ఎరువుల తయారీకి ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్న కారు రైతుల అనుమతితో ఆయా గ్రామాల్లో ఈ యూనిట్ల నిర్మాణానికి పూనుకున్నారు. ప్రభుత్వం కూడా ఇందుకు అనుగుణంగా వీటి నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు మంజూరు చేసింది. కంపోస్టు మెన్యూర్ అనే ప్రాజెక్టు పేరుతో ఒక్కొక్క తొట్టెకు రూ.10,523 వంతున కేటాయించింది.



కాండ్రకోటలో వినియోగంలో లేకుండా వృథాగా ఉన్న సంపద తయారీ కేంద్రం

అతీగతీలేని సందప తయారీ కేంద్రాలు

నియోజకవర్గంలో 41 గ్రామాల్లో పెద్దాపురం మండలంలో 23 గ్రామాలకు 19, సామర్లకోట మండలలో 18 గ్రామాలకు 15 సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. మిగిలిన గ్రామాల్లో ఉన్నా నిరుపయోగం మారాయి. నియోజకవర్గంలో అతి పెద్ద మేజర్ పంచాయతీలైన జి.రాగంపేట, అచ్చంపేట, ఉండూరు, వేట్లపాలెం, మేడపాడులో సంబంధిత అధికారులు సందప తయారీ కేంద్రాన్ని మండలానికి మోడల్ సంపద తయారీ కేంద్రంగా చూపిస్తూ కాలం నెట్టుకొస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నాడెప్ కంపోస్టు పిట్‌లు నిర్మాణాలకే పరిమితమయ్యాయే తప్ప వినియోగంలోకి రాక శిథిలావస్థకు చేరాయి. కాండ్రకోటలో నిర్మించిన సంపద తయారీ కేంద్రం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడంతో ప్రస్తుతం గ్రామ శివారులో ఉన్నప్పటికీ నిరుపయోగం మారింది.



చినబ్రహ్మదేవంలో నిరుపయోగంగా ఉన్న నాడెప్ కంపోస్టు తొట్టె

అవగాహన కరువు

రైతులకు అవగాహన లేకుండానే పంట పొలాల్లో, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వద్ద, రైతుల ప్రదేశాలల్లోనూ ఇష్టమొచ్చినట్టు కట్టేశారు కానీ వాటి వినియోగం, ఉపయోగంపై ఎటువంటి అవగాహనా కల్పించలేదు. దీంతో నాపెడ్ తొట్టెలు దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నాయి.

సేంద్రియ ఎరువులు వాడడం మేలు



ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రైతులు సేంద్రియ వ్యవసాయ సాగుపై దృష్టి సారించాలి. ఎరువుల కొనుగోలు కోసం రైతులు ప్రయాస పడకుండా అందుబాటులో ఉన్న సేంద్రియ ఎరువును కొనుగోలు చేసుకోవచ్చు. ఆర్బీకేల్లో సంపద తయారీలో ఉన్న సేంద్రీయ ఎరువు విక్రయాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. – సంజయ్‌కుమార్, వ్యవసాయాధికారి పెద్దాపురం

సంపద తయారీ కేంద్రాల అభివృద్ధికి చర్యలు



మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న సంపద తయారీ కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. నాలుగైదు గ్రామాల్లో ఈ కేంద్రాలు లేవు. అక్కడ కూడా తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఉన్న కేంద్రాలనూ వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఎరువు కొనుగోలుపై రైతులు మరింత ఆసక్తి కనబరిస్తే సంపద తయారీ కేంద్రాల అభివృద్ధి సాధ్యమవుతుంది. – జి.ఉషారాణి, ఎంపీడీఓ, పెద్దాపురం

మల్లవరంలో వంగా గీత పర్యటన



ఏకే మల్లవరంలో మాట్లాడుతున్న వంగా గీత

గొల్లప్రోలు: మండలంలోని ఏకే మల్లవరంలో ఆదివారం వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత పర్యటించారు. గ్రామంలో వేంచేసిన సుబ్రహ్మణేశ్వరస్వామిని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా జగనన్న ఇచ్చిన మాటప్రకారం ప్రభుత్వ పథకాలను అమలు చేశారన్నారు. ఎన్నికల నేపథ్యంలో విద్యా దీవెన, ఇన్‌పుట్ సబ్సిడీని ప్రతిపక్షాలు ఆపాలని చూసినా హైకోర్టు ఆదేశాల మేరకు విద్యా దీవెన, ఇన్‌పుట్ సబ్సిడీ రిలీజ్ చేశారన్నారు. రైతులు, మహిళల తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అరిగెల మణిబాబు, కొత్తెం దత్తుడు, రావుల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని యండపల్లి జంక్షన్ వద్ద ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సీపీఎం నాయకులు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాని సీఐటీయూ అఖిలభారత ఉపాధ్యక్షురాలు బేబీరాణి ప్రారంభించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐటీయూ నాయకులు వాహనదారులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

హాయిగా.. రయ్ రయ్‌మంటూ..



గొల్లప్రోలు-తాటిపర్తి రహదారికి ఇరువైపులా ఆహ్లాదాన్ని పంచుతున్న చెట్లు

గొల్లప్రోలు: మండువేసవిలో సైతం ఆ రహదారిలో ప్రయాణం హాయిహాయిగా సాగిపోతోంది. రహదారి పొడవునా ఉన్న పచ్చని చెట్లు వాహనదారులు, ప్రయాణికులకు ఎండ నుంచి రక్షణ ఇస్తున్నాయి. గొల్లప్రోలు హైవే నుంచి మండలంలోని తాటిపర్తి గ్రామం వరకూ రెండు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు ఉన్నాయి. ఇవి ఈ మార్గంలో వెళ్లే వాహనచోదకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. భానుడు ఉగ్రరూపం దాల్చినా ఈ రహదారిపై ప్రయాణం అలుపుసొలుపు లేకుండా హాయిగా సాగుతోంది. వాహనదారులు చెట్లకింద కాసేపు స్వేద తీరి ప్రయాణం సాగిస్తున్నారు.

వర్షంతో ఉపశమనం



కొత్తపల్లిలో కురుస్తున్న చిరుజల్లులు

పిఠాపురం: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారం నుంచే ఎండలు మండిపోయాయి. ఇటీవల వర్షం కురవడంతో వాతావరణం కాస్త చల్లబడింది. గత నాలుగు రోజులుగా మళ్లీ ఎండలు మండిపోవడంతో ప్రజలు అల్లాడిపోయారు. కాగా ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని వర్షం పడడంతో ప్రజలు సేదదీరారు. చిరు జల్లులతో ప్రారంభమై సాయంత్రం వరకు వర్షం కురవడంతో అప్పటి వరకు వేసవి తాపంతో అల్లాడిన జనం ఉపశమనం పొందారు. బంగాళాఖాతంలో ఈ నెల 22 నుంచి వాయుగుండం ఏర్పడనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మరో మూడు రోజుల పాటు అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

అకాల వర్షంతో సేద తీరిన ప్రజలు

కొత్తపల్లి: వేసవి తాపంతో అల్లలాడుతున్న ప్రజలు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి సేద తీరారు. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

పుస్తక పఠనంతో మరింత జ్ఞానం

పెద్దాపురం: పుస్తక పఠనంతో ప్రతి విద్యార్థికి మరింత పరిజ్ఞానం లభిస్తుందని ఉపాధ్యాయుడు ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం స్పోకెన్ ఇంగ్లిష్, పుస్తక పఠనం నేర్పించారు. ఈ సందర్భంగా సుమారు 20 మంది విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందిస్తున్న పుస్తకాలను చదివి విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా రామలింగేశ్వర స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో ఉమారామలింగేశ్వరస్వామి

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో వేంచేసిన ఉమారామలింగేర్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పీవీఎస్ మూర్తి, పూజ్యం సతీష్‌బాబు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పరిశీలన



స్ట్రాంగ్ రూముల వద్ద లాగ్‌బుక్‌లో సంతకాలు చేస్తున్న కలెక్టర్ నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

- కౌంటింగ్ ఏర్పాట్లపై కలెక్టర్ నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్ ఆరా

కాకినాడ సిటీ: కాకినాడ జేఎన్టీయూలో భద్రపరిచిన ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థకు సంబంధించిన, కౌంటింగ్ ఏర్పాట్లను ఆదివారం రాత్రి జిల్లా కలెక్టర్ జె.నివాస్, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి జేఎన్టీయూ ఇండోర్ స్టేడియంలో ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పెద్దాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, పెద్దాపురం ఆర్డీవో జె.సీ తారామరావు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పిఠాపురం ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను..

కాకినాడ సిటీ: పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి ఆదివారం రాత్రి జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలోని ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును సందర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూముకు వెళ్లి అక్కడి భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీసాలు, డబ్బాల్లో పెట్రోలు పోయద్దు

బంక్ యాజమాన్యాలకు ఆర్‌ఓ రామారావు హెచ్చరిక



పెద్దాపురం: నియోజకవర్గ పరిధిలోని పెట్రోల్ బంక్ యాజమాన్యాలు ఎన్నికల నిబంధలను తూచా తప్పకుండా పాటించాలని ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ విక్రయించాలన్నారు. ఎవరికీ గాజు సీసాలు, ప్లాస్టిక్ సీసాలో పెట్రోల్, డీసెల్ విక్రయించవద్దన్న నిబంధనను తూచా తప్పకుండా పాటించాలన్నారు. నిబంధలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ జేఎస్ రామారావు హెచ్చరించారు. వచ్చే నెల 10వ తేదీ వరకు నిబంధనలు ఉంటాయని, నియోజకవర్గ ప్రజలు సహకరించి తమ వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ పోయించుకోవాలని సూచించారు.

రత్నగిరిపై అలరించిన పుష్పాలంకరణ



సత్యదేవుని ఆలయం వద్ద పుష్పాలంకరణ



స్వామివారి ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



స్వామివారి అనివేటి మండపంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రత్నగిరిపై చేసిన పుష్పాలంకరణ భక్తులు విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారి ప్రధానాలయం, క్యూ లైన్లు, ధ్వజస్తంభం, అనివేటి మండపం వద్ద చేసిన అలంకరణ భక్తులను ఎంతగానో అలరించింది. భక్తులు ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు.

కల్యాణం.. కమనీయం

- కన్నులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణాలు
- భక్తిశ్రద్ధలతో తిలకించిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రాంగణంలోని మండపంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణ వేడుకను కన్నుల పండువగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణం జరిపారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విశేష సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. రాత్రికి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం తొమ్మిది గంటలకు గోపికా పూజ, సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. రాత్రికి పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో శ్రీనివాస కల్యాణం నిర్వహించి, తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.



ఎస్.అన్నవరంలో శ్రీవారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నేడు లక్ష్మీనారాయణ వ్రతం

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు లక్ష్మీనారాయణ వ్రతం, సాయంత్రం ఏడు గంటలకు శ్రీకృష్ణతులాభారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చిల్లంగిలో..

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగిలో ఏలేరు నది ఒడ్డున వేంచేసిన వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ పండితులు ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వేద మంత్రాలు, బాజాభజంత్రీల నడుమ స్వామివారి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

కిర్లంపూడిలో వేణుగోపాలస్వామి కల్యాణం

కిర్లంపూడిలో వేంచేసిన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.